275) సావేరి

ప॥ నేనెంత కోపినైన నీకేల చలము । పూనినట్టి నాకు నీవు బుద్ధి చెప్పరాదా ॥

చ॥ బీరము లాడేవారికి బిరుదులే యెక్కుగాక । వోరుపుగలవారికి వొరతున్నదా ।
నేరుపు గలవాడవు నేనేమనిన నీవు । ఆరితేరి చుట్టమవై అండనే వుండరాదా ॥

చ॥ తెరువ గలవారికి దిమ్ములట్టె రేగుగాక । మొగమోడే వారికి మోసమున్నదా ।
తగవరివట నీవు తత్తరించి నే మీరితే । నగుతా నన్ను బోధించి నమ్మించరాదా ॥

చ॥ వాసులు వట్టేవారికి వట్టి జోలి మించుగాక । సేసవెట్టిన వారికి సిగ్గులున్నవా ।
ఆసతో శ్రీవేంకటేశ ఆయములు నే నంటితే । యీసులేక కూడితివి యిక మెచ్చరాదా ॥